జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



సాగర తీరాన..మనవడితో.. తాతగారు..!

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభం

- ఏడాది రూ.28 కోట్లతో డొక్కా సీతమ్మ భోజనం!
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**కర్నూలు, మహానాడు:**
రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,149 మంది విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' అమలు చేస్తూ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.

శనివారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంటర్మీడియట్ విద్యార్థులకు



'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమంలో తాను భాగస్వామి అవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి వరకు అమలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకం అమలు అవుతోందన్నారు.. ఈ ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల రూపాయలను, వచ్చే ఆర్థిక విద్యా సంవత్సరం నుండి 86 కోట్ల రూపాయలను ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం

మిగతా.. 7లో

# మారిటైం గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్!

- ఇండియన్ నేవీ సహకారంతోనే సాధ్యం
- ఆపరేషనల్ డెమోలో సీఎం చంద్రబాబు పిలుపు



**విశాఖపట్నం, మహానాడు:**
దేశానికి రక్షణతో పాటు విపత్తు సమయంలో కూడా నావికాదళం అద్భుతంగా పని చేసి ప్రజల ప్రాణాలు కాపాడుతోందని.. తుఫాన్లు, వరదలు, ఆపద సమయంలో అందరికంటే ముందుండేది నావికా దళమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేశానికి అతి ముఖ్యమైన నావల్ హెడ్ క్వార్టర్‌గా విశాఖపట్నం తయారవ్వడం సంతోషంగా ఉందన్నారు. భారతదేశ సముద్ర సరిహద్దును రక్షించడం కోసం 1947 విశాఖలో నేవల్ స్థావరానికి పునాది పడిందని, అధికారికంగా తూర్పు నౌకాదళం 1983లో ఏర్పాటైందన్నారు. చిన్న నేవల్ బేస్‌గా ఉన్న తూర్పు నౌకాదళం కమాండ్ నేడు మహోన్నతంగా ఎదిగిందన్నారు. శనివారం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో జరిగిన నేవీ ఆపరేషనల్ డెమోకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.

నేవీ విన్యాసాలను సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ బాబుతో కలిసి తిలకించారు. అనంతరం సీఎం ప్రసంగించారు. 'మదిని మైమరపించేలా నేవీ బృందం అద్భుత విన్యాసాలను చేసి చూపించింది. వారి ధైర్యానికి, సామర్థ్యానికి, కఠోర దీక్షకు సెల్యూట్ చేస్తున్నా. నేవీ డే ఒడిశాలో జరిగినా విశాఖలో మళ్లీ డెమో నిర్వహించాలని వైస్ అడ్మినల్ నిర్ణయించడం చాలా సంతోషకరం. ఎంత క్రమశిక్షణ, కఠోర శ్రమ ఉంటేనే ఈ డెమో నిర్వహించడం సాధ్యం అవుతుంది. 1971లో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంలో విశాఖపట్నం నేవల్ కమాండ్ చాలా కీలకంగా పని చేసింది. పాకిస్తాన్ సబ్ మెరైన్ ఘాజీని ధ్వంసం చేసింది మన విశాఖ తూర్పు నౌకాదళమే. ఆ యుద్ధంలో ఇండియా గెలిచి చరిత్రలో నిలిచింది. కోల్‌కతా నుంచి చెన్నై వరకు కోస్టల్ ప్రాంతం ఉన్నా విశాఖ నావికా దళానికి ప్రత్యేకత ఉంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.



### హుద్‌హుద్ సమయంలో నేవీ చొరవ మర్చిపోలేను

2014లో వచ్చిన హుద్‌హుద్ సమయంలో నేను 10 రోజుల పాటు ఇక్కడే ఉన్నా. ఆ సమయంలో నేవీ చూపిన చొరవ నా జీవితంలో మరచిపోలేను. తుఫాన్ సమయంలో మత్స్యకారుల ప్రాణాలు కూడా కాపాడుతున్నారు. దేశ రక్షణ ఎంత ముఖ్యమో ఆర్థికంగా ముందుకెళ్లడం కూడా అంతే ముఖ్యం. దీనికి నావికాదళం కూడా పని చేస్తోంది. తూర్పు కోస్ట్‌లో ఉన్న అనేక పోర్టులను పరిరక్షించే బాధ్యత నావికా దళం తీసుకుంది. తూర్పు నౌకాదళం మన దగ్గర ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. ఎన్నిసార్లు విశాఖ వచ్చినా మీరు చూపించే అభిమానం నా జీవితంలో మర్చిపోలేను. విశాఖ అంటేనే ప్రశాంతత. ఇక్కడి ప్రజలు అంటేనే మంచితనం, నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరు అని సీఎం కొనియాడారు.

### పర్యాటక రాజధానిగా విశాఖ

దేశానికి ముంబై ఎలా ఆర్థిక రాజధానో.. ఏపీకి మన విశాఖపట్నం కూడా ఆర్థిక రాజధాని. రాబోయే రోజుల్లో విశాఖ మేటైన నగరంగా

మిగతా.. 2లో






విజయవాడ పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.

# విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలి

## యువత బ్రెయిన్ గెయిన్ చేయడానికి కృషి

### బాగా చదవండి.. ఒక్కసారి ఉద్యోగాలు వస్తే మీ జీవితాలు మారతాయి

- నాకంటే ఉన్నతస్థాయికి చేరేలా తీర్చిదిద్దుతా
- మెరుగైన పెర్ఫార్మెన్స్ కోసం ఐఐటితో ఒప్పందం
- విద్యార్థుల ప్రశ్నలకు లోకేష్ ఆసక్తికర సమాధానాలు

**అమరావతి, మహానాడు:**
రాష్ట్రంలో ఎకోసిస్టమ్ క్రియేట్ చేస్తున్నాం. ఇక్కడచదువుకున్న యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. యువత బ్రెయిన్ గెయిన్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు.

విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి లోకేష్ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు లోకేష్ ఆసక్తికరమైన సమాధానాలిచ్చారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి జక్రిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లకుండా విద్యార్థుల బ్రెయిన్ డ్రెయిన్ కాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు.

మంత్రి లోకేష్ సమాధానమిస్తూ 62 సంవత్సరాలు కలసికట్టుగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకున్నాం. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ తెచ్చేందుకు చంద్రబాబు ఎంతో

మిగతా.. 2లో



అరుదైన గౌరవం దక్కించుకున్న భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 05


కూటమి ప్రభుత్వం సినిమాలను రాజకీయం చేయదు 08


వ్యవసాయ భూములకే రైతుభరోసా 08

## విద్యార్థులారా... స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కండి!

- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ పిలుపు

**అమరావతి, మహానాడు:**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన విధానానికి అనుగుణంగా విద్యార్థులంతా మెరుగైన ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. విజయవాడ పాయకాపురం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్




మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలపై నేడు చిన్నచూపు ఉంది. దేశంలో ఇప్పటి ప్రధాని, సిఎంలు, న్యాయమూర్తులు ప్రభుత్వ స్కూళ్లలో చదివిన వాళ్లే. అయితే పలు కారణాలవల్ల ఆ తర్వాత ప్రజలు ప్రైవేటు వైపు మళ్లారు, ప్రభుత్వ విద్యకు మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషిచేస్తున్నారని తెలిపారు.

ఇంకా, ఆయన ఏమన్నారంటే...

రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని 34 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్య వివరాలను హెల్త్ కార్డుల్లో పొందుపరుస్తున్నాం. ఎనిమియా బారిన పడకుండా ఆర్ కె ఎస్ కె కార్యక్రమాన్ని ప్రారంభించాం. జూనియర్ కాలేజిల్లో మధ్యాహ్న భోజన పథకం మొదటిసారిగా అమలుగా చేసున్నది ఏపీలో మాత్రమే. ఇందుకోసం ప్రభుత్వం 90 కోట్లు ఖర్చుచేస్తోంది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేస్తున్నాం. గుడ్ల రేటు తగ్గినా రేటు తగ్గించకుండా గతంలో ఎంతో అవినీతికి పాల్పడ్డారు. గుడ్లపై కూడా స్టాంపు వేసుకున్నారు. వారి పేర్లతో

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 05, జనవరి 2025




రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారితో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి

## మారిటైం గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్!

(మొదటిపేజీ తరువాయి..)

తయారవుతుంది. పర్యాటక రాజధానిగా విశాఖను మార్చుతాం. పోర్టులు ఉన్నాయి, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. అతిపెద్దదైన గంగవరం పోర్టు ఉంది. మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుంది. మెట్రోరైల్ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తాం. రాష్ట్రాన్ని మారిటైం గేట్‌వేగా తయారు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. గూగుల్ తన డేటా సెంటర్‌ను విశాఖలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్ కూడా విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇంకా మరికొన్ని ఐటీ కంపెలు తమ సంస్థలను నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం వచ్చి రైల్వేజోన్‌కు శంకుస్థాన చేస్తారు. గ్రీన్ హైడ్రోజన్ మొదటి ప్రాజెక్టు కింద ఎన్టీపీసీ-ఏపీజెన్‌కో జాయింట్ వెంచర్ వేస్తున్నాయి. దీనికి కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. గోదావరి నీళ్లు ఈ ఏడాది అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖపట్నానికి తీసుకొస్తాం అని స్పష్టం చేశారు.

### నాలెడ్జ్ సిటీగా విశాఖ

విశాఖపట్నాన్ని నాలెడ్జ్ సిటీగా తయారు చేసేందుకు కట్టుబడి ఉన్నాం. నేవీ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తే విశాఖ నుండే ఎక్కువ మంది ఎంపికవుతున్నారు. అరకు కాఫీని ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేస్తున్నాం. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తున్నాం. అతిపెద్ద ఆకర్షణగా ఉన్న కురుసర సబ్ మెరైన్ మ్యూజియం కూడా 2002లో ఇక్కడ ఏర్పాటు చేసుకున్నాం. 2017లో రూ.14 కోట్లతో టీయూ142 ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖపట్నంను ఆర్థిక, టెక్నాలజీ, ఫార్మా, మెడికల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు పని చేస్తున్నాం. వికసిత్ భారత్ లో భాగంగా ప్రధాని మోదీ డిఫెన్స్ రంగంలోనూ అభివృద్ధి సాధించేందుకు ముందుకెళ్లారు. దేశం ఆర్థికంగా దూసుకెళ్తోంది. డిఫెన్స్ రంగంలో సమర్థవంతంగా ఉండేందుకు నేవీ చేస్తున్న కృషి అసామాన్యం.

దేశ నేవీని చూస్తే ఇతర దేశాలు భయపడుతున్నాయి. ప్రాణాలు లెక్కపెట్టకుండా దేశం కోసం పోరాడే నేవీని మనస్ఫూర్తిగా అభినంది స్తున్నాం. రాష్ట్రంలో సుమారు వెయ్యి కి.మీ కోస్టల్ లైన్ ఉంది. మౌలిక సదుపాయాలు కల్పిస్తే మన యువతకు ఉపాధి, సంపద సృష్టికి ఉపయోగపడు తుంది. దేశ భవిష్యత్తును రక్షించేందుకు ఏ విధంగా ముందుకెళ్తున్నారో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా నేవీ ముందుకు రావాలని కోరుతున్నా. ఏఐ, డ్రోన్, డీప్ టెక్ నేవీకి కూడా అవసరం ఉంది. ఓషియన్ ఎకానమీలో కూడా ప్రభుత్వానికి నేవీ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నా అని సీఎం చంద్రబాబు అన్నారు.



**విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏఆర్ శ్రీనివాస్ నియామకం**

**రెండేళ్ల పాటు విజిలెన్స్ డైరెక్టర్‌గా కొనసాగునున్న ఏఆర్ శ్రీనివాస్**



వినుకొండ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన జీవీ, మక్కెన

# విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి..)

కృషిచేశారు. 2014లో కట్టుబట్టలతో బయటకు వచ్చాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణతో ముందుకు వెళ్లాం. ఒక్క కియా వల్ల అనంతపురం తలసరి ఆదాయంలో 3వ స్థానానికి చేరింది. చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు తెచ్చాం, ప్రకాశంలో బయో ఫ్యుయల్ రంగంలో పెట్టుబడులకు రిలయన్స్ ముందుకు వచ్చింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ఉభయ గోదావరి ఆక్వా, డిఫెన్స్, పెట్రో కెమికల్స్, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా, ఐటి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.

షణ్ముక్(ఇంటర్ బైపిసి) మట్లాడుతూ

కళాశాలలో కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. కాలేజి సంరక్షణ ఇబ్బందిగా ఉంది. మీరు మా బంగారు భవిష్యత్తును నిర్మిస్తారని నమ్ముతున్నాం. కళాశాల పక్కనే బాలికల వసతి గృహం ఉంది. వరదల సమయంలో క్రిమికీటకాల వల్ల అక్కడి విద్యార్థినులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరోవైపు బాయ్స్ హాస్టల్ కూడా ఉంది. ఆ బిల్డింగ్ కూడా శిథిలావస్థలో ఉంది. అక్కడి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మేము మీ స్థాయికి చేరుకునేలా సహకారం అందించండి అని కోరాడు.

మంత్రి మాట్లాడుతూ మీరు నాకన్నా పెద్దస్థాయికి చేరాలన్నదే నా ఆకాంక్ష. ప్రధాని నరేంద్ర మోడీ, చంద్రబాబు నేతృత్వంలో భారత్‌లో అద్భుతమైన అవకాశాలు వస్తున్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి, షణ్ముక్ కోరిన విధంగా తప్పనిసరిగా కాంపౌండ్ వాల్, హాస్టళ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మరమ్మతులు, అభివృద్ధికి 5 వేల కోట్లు అవసరం, ఎలా సమీకరించాలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నాటికి అడిషనల్ క్లాస్ రూమ్స్, పెయింటింగ్స్, ప్లే గ్రౌండ్, ల్యాబ్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

మయూరి(సెకండ్ ఇయర్, ఎంపిసి) మాట్లాడుతూ

సమాజంలో ప్రభుత్వ కాలేజి విద్యార్థులను చిన్నచూపు చూస్తారు, ప్రైవేటు కాలేజిలతో సమానంగా మమ్మల్ని చూడటానికి ఎటువంటి చర్యలు తీసుకుంటారు అని ప్రశ్నించాడు.

లోకేష్ సమాధానమిస్తూ ప్రైవేటురంగంలో జూనియర్ కాలేజిలు పిల్లలు కేటగిరైజ్ చేసి సబ్జెక్టువారీగా ఎక్సపర్ట్ లతో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ కాలేజిల్లో కూడా కొచ్చన్ బ్యాంకు, మోడల్ పేపర్ల విధానాన్ని తెస్తున్నాం. విద్యార్థుల పనితీరును తెలుసుకునేలా తల్లిదండ్రుల వాట్సాప్ కు లింకు చేస్తాం. వివిధ సబ్జెక్టులో పెర్ఫార్మెన్స్ సప్లిమెంటేషన్ కోసం ఐఐటి మద్రాసుతో ఒప్పందం చేసుకున్నాం. పనిగంటలను గంటన్నర పెంచాం. కామన్ ఇన్ ఫ్రాస్టర్ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరానికి ఇవన్నీ పూర్తిచేస్తామని చెప్పారు.

ఎం.రాజేష్ (సీనియర్ ఎంపిసి) మాట్లాడుతూ

యువగళంలో 3వేలకు పైగా కి.మీ.ల పాదయాత్ర చేశారు, మీ ఫిట్‌నెస్ గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం, మీ ఇన్స్పిరేషన్ ఎవరు? అని ప్రశ్నించాడు

లోకేష్ సమాధానం ఇస్తూ .. ఫిట్‌నెస్ కన్నా సంకల్పం అవసరం. మార్పుకోసమే విద్యాశాఖను తీసుకున్నాను. రోడ్ లెస్ ట్రావెల్ చేసి కష్టతరమైన రహదారిని సులభతరం చేసుకోవాలి. జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే ఆ శక్తి మనకు వస్తుంది. నాకు ముగ్గురు వ్యక్తులు ఇన్స్ఫిరేషన్... లిక్వానియో, సింగపూర్ ప్రధానిగా పనిచేశారు. మత్స్యకారులు ఉన్న చిన్న ప్రాంతాన్ని ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేశారు. మాజీ ప్రధాని వాజ్ పేయి అందరి సమస్యల గురించి తెలుసుకుంటారు, మంచి ఐడియాలను ఇంప్లిమెంట్ చేస్తారు. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరు. 75సంవత్సరాల వయసులో అందిరకంటే స్పీడ్‌గా పనిచేస్తారు. వారి ముగ్గురినుంచే నేను స్ఫూర్తి పొందాను. మీరు కూడా ఉన్నతమైన వ్యక్తులను రాజకీయాలకు అతీతంగా ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లండి అని అన్నారు



### ఇచ్చిన మాట వెంటనే నిలబెట్టుకున్న నారా లోకేశ్

- పాయకాపురం ప్రభుత్వ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం
- తమ భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న రమ్య అనే విద్యార్థిని
- వెంటనే స్పందించిన లోకేశ్
- కొన్ని గంటల్లోనే సీసీ కెమెరాలు అమర్చిన వైనం
- నిరంతరం పర్యవేక్షిస్తుండాలని బెజవాడ సీపీకి లోకేశ్ ఆదేశాలు

**అమరావతి, మహానాడు:** విజయవాడ పాయికాపురంలో ఈరోజు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం సందర్భంగా రమ్య అనే సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని చెప్పిన సమస్యపై మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. ఆయన స్పందన గంటల వ్యవధిలోనే కార్యరూపం దాల్చింది.

కళాశాల వెలుపల రాత్రి వేళ ఇబ్బందులు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రమ్య మంత్రి లోకేశ్‌ను కోరింది. విద్యార్థినుల భద్రత అంశాన్ని సీరియస్ గా తీసుకున్న లోకేశ్... పాయకాపురం జూనియర్



కళాశాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నాయేమో కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందిగా లోకేశ్ విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబును ఆదేశించారు.

చెప్పిన గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంపై పాయకాపురం జూనియర్ కళాశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డైనమిక్ మినిస్టర్ పనితీరు ఎలా ఉంటుందో చేతల్లో చూపించారని వారు కొనియాడారు.

**లోకేష్:** క్లాస్ రూమ్స్, పెయింటింగ్, ప్రహరిగోడ, ల్యాబ్స్ ఏర్పాటుకు కృషిచేస్తా. పాస్ పర్సంటేజి పెరిగితే మరిన్ని సౌకర్యాలు కల్పిస్తా. కష్టపడి చదివి మంచి పేరు తీసుకురండి.

### కె.నీలిమ, ఎంపిసి, సెకండియర్....

**కళాశాలకు పెయింటింగ్ వేయించండి. ల్యాబ్‌లు ఏర్పాటుచేయండి.**

**లోకేష్:** కళాశాలకు పెయింటింగ్ చేయిస్తా. పెయింట్స్ తోపాటు మిగతా ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కల్పిస్తాం. పరీక్షలు పూర్తయ్యాక అడిషనల్ క్లాస్ రూమ్స్, ఇతర సౌకర్యాలు కల్పిస్తాం.

### రమ్య సీనియర్ ఇంటర్, బైపిసి...

**రాత్రిపూట ఇబ్బంది కలగకుండా కాలేజి వెలుపల సిసి కెమెరాలు ఏర్పాటుచేయండి.**

**లోకేష్:** రేపటికల్లా కెమెరాలు పెట్టిస్తాం, పోలీసు శాఖకు అనుసంధానిస్తాం.

### వైష్ణవి, సీనియర్ ఇంటర్ సిఇసి.....

**చాగంటి కోటేశ్వరరావు గారి ద్వారా నైతిక విలువల పెంపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు?**

**లోకేష్:** నేను ఇటీవల ఆయనను కలిశాను. పిల్లలకు ప్రత్యేకంగా ఒక బుక్ తయారుచేసి ఇవ్వాలని నిర్ణయించాం. ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో క్లస్టర్ యూనిట్ గా నేరుగా పిల్లలతో సమావేశమై చైతన్య పర్చేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తంచేశారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మహిళలు మాట్లాడాలి. మహిళలను అవమానకరంగా మాట్లాడే కొన్ని పద్ధతుల్లో మార్పు రావాలి. మార్పు మానుంచి, ఫిల్మ్ స్టార్స్ నుంచి, సమాజం నుంచి రావాలి.

### షేక్ రేష్మా (సీనియర్ ఇంటర్ బైపిసి)....

**మా కళాశాలలో 8 సెక్షన్లు ఉన్నాయి, 4 క్లాస్ రూమ్స్ మాత్రమే ఉన్నాయి, మరో 4 క్లాస్ రూమ్‌లు మంజూరు చేయండి.**

### పి.కేశవసాయి(సెకండియర్ ఎంపిసి)...

**యువతను డ్రగ్స్ నుంచి బయటకు తీసుకు రావడానికి మార్గాలు చెప్పండి.**

**మంత్రి సత్యకుమార్:** విద్యార్థులంతా దుర్వ్యసనానికి దూరంగా ఉండండి, ఎవరైనా డ్రగ్స్ బారిన పడితే టోల్ ఫ్రీ నెంబర్‌కు చెప్పండి. డీ ఎడిక్షన్ సెంటర్లు పెడుతున్నాం. యువతను డ్రగ్స్ బారిన పడకుండా టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేశాం. మీరంతా దూరంగా ఉండటంతో పాటు మిత్రులు కూడా వాటి బారిన పడకుండా కాపాడుకోవాలి అని అన్నారు.

## విద్యార్థులారా... స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కండి!

(మొదటిపేజీ తరువాయి..)

దీవెనలు, కానుకలని పేర్లు పెట్టుకున్నారు. వారి సొంత ఖజానా నుంచి ఏమైనా ఇచ్చారా? ఇప్పుడు చంద్రబాబు, లోకేష్ వారి పేర్లు పెట్టుకున్నారా? బాధ్యత కలిగిన వారు కనుక ఆ పనులు చేయలేదు. తల్లిదండ్రులు, గురువు, దేవుడికి మాత్రమే దీవెనలు ఇచ్చే అర్హతలు ఉన్నాయి.

తాము దైవాంశ సంభూతులమని ఎవరన్నా అనుకుంటే వారిని దూరంగా ఉంచండి. అటువంటి వ్యక్తులు, శక్తులకు దూరంగా పెట్టండి. రాష్ట్రంలో యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ సెన్సస్ చేస్తున్నారు. మీ గురించి ఆలోచించే డైనమిక్ మంత్రి ఉన్నారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి, రాబోయే రోజుల్లో మీ కాళ్లపై మీరే నిలబడేలా కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తుంది. ఇప్పుడు నాలెడ్జి ప్రాక్టీషనర్స్ గా ఉన్నాం, నాలెడ్జి ప్రొడ్యూసర్స్ గా లేము. రాబోయే రోజుల్లో ప్రొడ్యూసర్స్ గా తయారు కావాల్సి ఉంది. గూగుల్, యాపిల్ వంటి సంస్థలు ఇక్కడే ఏర్పాటవుతాయి. సంపద సృష్టిలో ఏరకంగా భాగస్వాములు కావచ్చో విద్యార్థులు ఆలోచించండి. కుటుంబానికి, రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడేలా తయారుకావాలని మంత్రి సత్యకుమార్ కోరారు.

### రాష్ట్ర విద్యచరిత్రలో మైలురాయి

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ.... రాష్ట్ర విద్య చరిత్రలో ఇదొక మైలురాయి. ఈ ప్రయాణంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. రాష్ట్రం నాలెడ్జి ఎకానమీ కావాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ క్రమంలో విద్యావ్యవస్థ పాఠశాల, ఇంటర్మీడియట్, కళాశాల విద్య కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ కళాశాలలకు మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి, పేదవారే ఎక్కువగా వస్తారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య ముఖ్యమైన మెట్టు. ప్రైవేటు విద్యకు దీటుగా చేయాలనే ప్రయత్నంలో ఏమాత్రం ఆలోచించకుండా ఆర్థిక భారం ఉన్నా సీఎంతో మాట్లాడి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇంటర్మీడియట్ వ్యవస్థలో చాలా సవాళ్లు ఉన్నాయి. కొన్ని మార్పులు చేయడానికి కొంత సమయం పట్టవచ్చు. ఎన్ రోల్ మెంట్, ఉత్తీర్ణత, మౌలిక వసతులు వంటి సమస్యలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో వాటన్నింటినీ పరిష్కరిస్తాం. విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులు గర్వించదగ్గ పౌరులుగా



ఎదగండి.

### స్వర్ణాంధ్రసాధన విద్యార్థుల చేతుల్లోనే....

ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి నివసించే ప్రాంతంలో మధ్యాహ్న భోజన ప్రారంభించడం హర్షణీయం. దివంగత ఎన్టీఆర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఆయన మనుమడు లోకేష్ ఇంటర్ విద్యార్థులకు ప్రారంభించడం ఆనందంగా ఉంది. విద్యాశాఖలో అనూహ్య మార్పులు తెస్తున్న లోకేష్ కు అభినందనలు. ప్రతి ఆరునెలలకు పీటీఎం నిర్వహించడం వల్ల లోటుపాట్లు తెలుస్తాయి. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలనే సూత్రాన్ని విద్యార్థులంతా



లోకేష్ ను చూసి నేర్చుకోవాలి. చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా మేమంతా కష్టపడతాం.

సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలకు మహర్దశ పడుతోంది. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ కూడా ఉచితంగా ఇస్తున్నారు. మీ భవిష్యత్తు కోసం డొక్కా సీతమ్మపేరుతో మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. మీ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడానికి కృషి చేయండి. ఈ ప్రభుత్వం మీకోసం పనిచేసే ప్రభుత్వం, చిన్న చిన్న కుటుంబాల నుంచి వచ్చిన మీరు ఉన్నత స్థితికి చేరుకోవడం చదువుకోవడం ద్వారా మాత్రమే కుటుంబ స్థితగతులు మారడం సాధ్యం. పేదల విద్య కోసం ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేస్తోందని ఉమ అన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న,
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారధ్యంలో





బోడపూడి సుబ్బారావు (BSR)
సారధ్యంలో



03
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 05, జనవరి 2025

# వైకుంఠ ఏకాదశికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు

- టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు
- సామాన్య భక్తులకు పెద్ద పీట



**తిరుపతి, మహానాడు:** వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో సామాన్య భక్తులు ప్రశాంతంగా శ్రీవారిని దర్శించుకునేలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని టిటిడి ఛైర్మన్ బీఆర్. నాయుడు తెలిపారు. 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు భక్తులు శ్రీవారి దర్శించుకునేందుకు వీలుగా టిటిడి అధికారులు, మునిసిపల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి శనివారం రామచంద్ర పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, భక్తులు సంయమనం పాటించి శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు. 10 రోజుల పాటు భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి ఈనెల తొమ్మిదో తేదీన ఉదయం 5 గం.ల నుండి 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకొని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు మంజూరు చేస్తారన్నారు.

తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కొరకు తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారని నాయుడు తెలిపారు.

ఈనెల 13 నుండి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేసేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.

తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, బారీకేడ్లు, షెడ్లు, భద్రత, మంచినీరు, మరుగుదొడ్లు తదితర పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో ఎం.గౌతమి, సివిఎస్వో శ్రీధర్, మునిసిపల్ కమిషనర్ ఎన్ మౌర్య, టిటిడి సీఈ సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# 'పోలవరం' నిర్వాసితుల సంక్షేమమూ ముఖ్యమే..

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, మహానాడు:**

ఓవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపడుతూనే.. మరోవైపు నిర్వాసితుల సమస్యలను తీరుస్తున్నాం. 2014-19 మధ్య కాలంలో పోలవరం నిర్మాణం ఎంత ఫాస్టుగా జరిగిందో.. అదే స్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందచేశాం. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ అలవికాని హామీలు ఇచ్చింది.. నమ్మబలికిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. మరింత ఎక్కువ పరిహారాన్ని అందిస్తామని బూటకపు హామీలిచ్చింది. కానీ ఐదేళ్ల పాలనలో ఒక్క పైసా కూడా విదల్చలేదు గత ప్రభుత్వమని ఆయన ఆరోపించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే, పైగా డబ్బులు ఉంటే ఇవ్వనా..? కేంద్రం డబ్బులివ్వాలి.. వాళ్లేమో డబ్బులివ్వడం లేదు.. నేను డబ్బులు ప్రింట్ చేయలేను.. చేసే అధికారం నాకుంటే.. ప్రింట్ చేసి డబ్బులు ఇచ్చేసేవాడిని అంటూ నాటి ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్ రెడ్డి అత్యంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడారు. దీన్ని నిర్వాసితులే కాదు.. రాష్ట్ర ప్రజలెవ్వరూ మరిచిపోలేదు.

పోలవరం మా ప్రాధాన్యం కాదు.. కాబట్టి నిర్వాసితులను గాలికి వదిలేసినా ఫర్వాలేదనే రీతిలో నాటి వైసీపీ ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించింది. పైగా గద్దె దిగుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి.. ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయింది. రాష్ట్రం ఆర్థికంగా పీకల్లోతు కష్టాల్లో ఉన్నా.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తిరిగి పునర్ ప్రారంభించడమే కాకుండా.. నిర్లక్ష్యానికి గురైన నిర్వాసితులకు అండగా నిలవాలని చంద్రబాబు భావించారు. బిల్లుల చెల్లింపులపై సీఎం చేపట్టి సమీక్షలో ఆర్థిక శాఖ ప్రతిపాదనలపై చర్చించారు. అత్యవసర ఖర్చులు.. చెల్లింపులు ఏమున్నాయనే అడిగారు.

రైతులకు ధాన్యం కొనుగోళ్ల డబ్బులను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరపాలనే పాలసీ పెట్టుకున్నామని.. అలాగే పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం కూడా పెండింగులో ఉందనే విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశం ప్రస్తావనకు రాగానే.. పోలవరం నిర్వాసితులకు సంబంధించి ఆర్థిక శాఖ వద్ద ఎన్ని బిల్లులు పెండింగులో ఉంటే.. అన్నింటిని మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్వాసితులకు నష్టం చేస్తూ.. వారికి న్యాయం చేయకుండా ప్రాజెక్టు కట్టడం సరైన పద్ధతి కాదని.. ఇతర అవసరాలకు నిధుల పరంగా ఏమైనా ఇబ్బందులు వచ్చినా.. ఏదో రకంగా సమకూర్చుకోవాలని.. పోలవరం నిర్వాసితులకు.. అందులోనూ.. 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు పరిహారం చెల్లింపులను హై ప్రయార్టీగా తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

రాష్ట్రం ఇంకా ఆర్థికంగా పూర్తి స్థాయిలో వెసులుబాటులోకి రాకున్నా.. మానవీయ కోణంలో చంద్రబాబు ఆలోచన చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు త్వరలో వస్తాయని.. అయినా వాటి కోసం ఆగొద్దని స్పష్టం చేశారు చంద్రబాబు. కేంద్రం ఇచ్చే నిధుల కోసం ఎదురు చూస్తూ నిర్వాసితులను మరింత కాలం వేచి చూసేలా చేయడం కరెక్ట్ కాదని సీఎం చెప్పారు. నిర్వాసితులకు ఇచ్చిన పరిహారం వివరాలను కూడా తనకు ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని.. అలాగే కేంద్రానికి దీనికి సంబంధించిన వివరాలు పంపాలని ఆదేశించారు చంద్రబాబు.

ప్రభుత్వం మారితే తమ తలరాతలు మారతాయని ప్రజలంతా భావించారని.. పేదలు.. మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వంపైనా.. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయడం.. ప్రభుత్వ ప్రథమ బాధ్యత అంటూ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సాఫీగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, మహానాడు:**

గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సజావుగా నిర్వహించుకునే బాధ్యత అధికారుల దగ్గర నుండి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరి మీద ఉన్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పేర్కొ న్నారు. శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన పరిణామాల మీద ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పందించారు. నగర అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ సమావేశాల్లో ఇటువంటి పరిణామాలు ఏ మాత్రం ఆమోద యోగ్యముగా లేదని, ఇటువంటి ఘటనలను ప్రజలు ఎవరు హర్షించారని ఆమె పేరుకొన్నారు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వాలని, అదే సమయంలో సభను గౌరవంగా జరిపే బాధ్యత మేయర్ మరియు సభ్యుల మీద ఉన్నదని, ఇప్పటికే నగరంలో పనులు అన్నీ పెండింగ్‌లో ఉండి, ముందుకు వెళ్లకుండా ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇలా కౌన్సిల్ జరగకుండా చేయడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు.

## మెరుగైన ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని
# రాష్ట్రంలో నూతన పెట్టుబడులు పెట్టాలి

- ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్



**హైదరాబాద్, మహానాడు:**

మెరుగైన ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలో నూతన పెట్టుబడులు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ పెట్టుబడుదారులకు పిలుపునిచ్చారు. హైదరా బాదులో జరుగుతున్న ఆప్తా NRI పారిశ్రామికవేత్తల సదస్సులో ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులు ఏర్పాటు చేసినటువంటి పలు కంపెనీల స్టాల్ లను ఛైర్మన్ ప్రభాకర్ పరిశీలించి పలు రాష్ట్రల మరియు 25 దేశాలకు సంబంధిచిన ఆయా కంపెనీల NRI ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని, పారిశ్రామికవేత్తలను ఛైర్మన్ ప్రభాకర్ ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఏపీలో నైపుణ్యం కలిగిన యువత ఉందని, ప్రతిభకు తగిన అవకాశాల కోసం వారు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

- మన్యం జిల్లా సాలూరులో ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు, మహానాడు:**

రాష్ట్రంలో గత అయిదేళ్ల అస్తవ్యస్త పాలనలో దెబ్బతిన్న ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు విద్య, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఫలితాల మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ఆమె సాలూరులో ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి లోకేష్ లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 398 సమీపంలోని పాఠశాలలకు అనుసంధానమై ఉన్నాయి. అక్కడ భోజనాలను తయారు చేస్తారు. మిగిలిన 77 కళాశాలలకు కేంద్రీకృత వంటశాలలకు అనుసంధానించారని తెలిపారు.

# యువతను వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**గుంటూరు, మహానాడు:**

ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్న వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తేనే భవిష్యత్తులో మరింత మంది యువత వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపుతారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా "అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025" పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 250 మంది అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, పంటలో ఎక్కడైతే చీడపురుగులు ఉన్నాయో అక్కడే డ్రోన్ టెక్నాలజీ సహాయంతో మందులు పిచికారి చేయవచ్చన్నారు.

డ్రోన్స్ అంటే ఒకప్పుడు పెళ్లిళ్ల వంటి కార్యక్రమాల్లో ఉపయోగించే వారనీ, కానీ ప్రస్తుతం వ్యవసాయంలో వీటి వినియోగం విరివిగా ఉందన్నారు. పంటకు పట్టిన తెగులును రైతు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ డ్రోన్ టెక్నాలజీతో పంట తెగులును ముందుగానే గుర్తించి.. ఎక్కడ తెగులు వ్యాపించిందో అక్కడ మాత్రమే మందులను పిచికారి చేయొచ్చని వివరించారు. కాబట్టి రైతులు డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కోరారు. రైతులందరూ పంటలు పండటానికి అనువుగా భూసార పరీక్షలు చేయించిన తరువాతే పంటలు వేయాలని కోరారు.

ఏపీలో శాటిలైట్, క్లౌడ్ టెక్నాలజీ వినియోగించి.. భూసార పరీక్షలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పంటలు వరదలు, తుఫాన్లను కూడా తట్టుకోగలవన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్‌లపై రాయితీ ఇస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో పొలంలో విత్తనం విత్తే దగ్గర నుంచి పంటను మార్కెట్‌లో అమ్మే వరకు కూడా రైతులకు యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

### సరికొత్త టెక్నాలజీ రావాలి: లావు రత్తయ్య

వ్యవసాయ రంగంలో సరికొత్త టెక్నాలజీ రావాల్సిన అవసరం ఉందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు మంచి దిగుబడి వస్తుందా? ఒకవేళ దిగుబడి వచ్చినా మంచి ధర లభిస్తుందా? అని రత్తయ్య ప్రశ్నించారు. భారీగా రసాయన ఎరువులను వినియోగించి సాగు చేయడం సాధ్యంకాదన్నారు. అయితే సేంద్రీయ వ్యవసాయాన్ని దేశంలోని అందరూ ఒకేసారి కాకుండా, మెల్ల మెల్లగా విస్తీర్ణాన్ని పెంచుకుంటుపోవాలని హితవు పలికారు.

### పంటను రెట్టింపు చేయాలి: లావు శ్రీకృష్ణదేవరాయలు

రైతుల సరికొత్త విధానాలు, శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలతో పంట దిగుబడి రెట్టింపు చేసి.. నీరు, రసాయనాలను సగం చేయాలని అభ్యుదయ రైతులను వర్సిటీ వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. రైతు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చారు. ఆదర్శ రైతులను సన్మానించడంతో పాటు వారి ఐడియాలను గురించి మాట్లాడేందుకు ఇది మంచి కార్యక్రమం అన్నారు.

### వ్యవసాయంలో ఆవిష్కరణలు రావాలి: యడ్లపల్లి వెంకటేశ్వరరావు

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు రావాలని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కొత్త వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతల గురించి ఫౌండేషన్ తరుపున రైతులకు శిక్షణ ఇస్తామని తెలియజేసారు. వ్యవసాయ రుణాలు పొందడంలో రైతులకు సహకరించడం. పంటల బీమా పథకాలు గురించి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ముఖ్య అతిథులను, రైతు దంపతులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, రెండు రాష్ట్రాల రైతు దంపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా విధానంలో వినూత్న మార్పులకు నారా లోకేష్ కృషి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ, మహానాడు:** విద్యా విధానంలో వినూత్న మార్పులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం అవనిగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా అభివృద్ధి ధ్యేయంగా నారా లోకేష్ ప్రతిష్ఠాత్మకంగా విద్యా శాఖను చేపట్టి సమూల మార్పులకు కృషి చేస్తున్నారని తెలిపారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక మంచి వాతావరణంలో విద్య కొనసాగించేందుకు అనువుగా కృషి చేస్తున్నారన్నారు.

ఇంటర్ విద్యార్థుల విలువైన సమయం వృధా కాకూడదు అనే లక్ష్యంతో నాడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాన్ని జగన్ అనాలోచితంగా తొలగించారని తెలిపారు. ఎదిగే వయసులో ఉండే పిల్లలకు పోషక ఆహారం అందించేందుకు కూటమి ప్రభుత్వంలో మళ్ళీ ఈ పథకాన్ని పునరుద్ధరించామని బుద్ధప్రసాద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యత పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు గుడిసేవ విష్ణుప్రసాద్, మత్తి శ్రీనివాసరావు, నక్కా విజయబాబు, ఎంఈఓలు ఎన్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం జీ.ఎన్.బీ.గోపాల్, ప్లేట్లు, గ్లాసుల దాత బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, వార్డు సభ్యురాలు పుష్పావతి, పూషడపు సుబ్బారావు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025





















విజయవాడ
పాయకాపురం ప్రభుత్వ
జూనియర్ కళాశాలలో డొక్కా
సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం
ప్రారంభోత్సవం సందర్భంగా
మంత్రి లోకేష్ విద్యార్థులతో
ముఖాముఖి సమావేశ
దృశ్యాలు























జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
5
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025



హైందవ శంఖారావం సభాస్థలిని సందర్శించిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**కేసరపల్లి, మహానాడు:** గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "హైందవ శంఖారావం" సభా స్థలి ఏర్పాట్లను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ శుక్రవారం పరిశీలించారు. దేవాలయ సంరక్షణా మహోద్యమంలో హిందువులందరు భాగస్వామ్యం అవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# చంద్రగిరి 'బీసీ' విద్యార్థినులకు మెరుగైన వైద్యం

- **తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మంత్రి సవిత ఆదేశం**

**అమరావతి, మహానాడు:**

చంద్రగిరి ఇంటిగ్రేటెడ్ బాలిక హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థతపై మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యమందించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 27 మంది చంద్రగిరి ఇంటిగ్రేటెడ్ బాలిక హాస్టల్ విద్యార్థినులు వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 బీసీ విద్యార్థినులు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్‌తో



మంత్రి సవిత ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆదేశించారు.

అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. హాస్టల్‌లో మిగిలిన విద్యార్థినులంతా క్షేమంగా ఉన్నారని మంత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు.

అస్వస్థతకు గురైన విద్యార్థినులను వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలన్న మంత్రి.. హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్య పరి స్థితిపై ఎప్పటికప్పుడు సమాచారమందించాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌ను మంత్రి సవిత ఆదేశించారు.

# హైందవ శంఖారావం సభ ఏర్పాట్లను పురందేశ్వరి పరిశీలన

**గన్నవరం, మహానాడు:**

విజయవాడ దరి గన్నవరం సమీపంలోని కేశరపల్లి వద్ద విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావం సభ ఏర్పాట్లను భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పరిశీలించారు. పురందేశ్వరిని వీహెచ్‌పీ నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సభకు హాజరయ్యేందుకు వచ్చే వారికి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పురందేశ్వరికి వివరాలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చేవారు ఏవిధంగా వస్తున్నారు... వారి ఏర్పాట్లు ఏ విధంగా చేశారు అనే విషయాలను రవికుమార్ పూసగుచ్చినట్టు వివరించారు. పురందేశ్వరి





వెంట పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురు పాటికుమార స్వామి, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, నూతల పాటి బాల, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం

- **నూజివీడులో లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి..**

**ఏలూరు/నూజివీడు, మహానాడు:**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుగా ఈఏడాది 27.39 కోట్లు, వచ్చే విద్యాసంవత్సరంలో రూ. 85.84 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేయనున్నదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. శనివారం నూజివీడు ముడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థ సారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవా త్మకమైన మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుం దన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి పరుస్తుందన్నారు.

విద్యార్థులు బాగా చదువుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు పొంది తద్వారా తమ కుటుంబాలను బాగా చూచుకోవాన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఫలితాల మెరుగుదలకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యానభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులకు నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడాన్ని నిర్ణయించామ న్నారు.

ఇందుకోసం ఈఏఢాది రూ.27.39 కోట్లు, వచ్చే విద్యా సంవత్సరంలో రూ.85.84 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనుందన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లాలో 19 జూనియర్ కళాశాలల్లో 3,734 మంది విద్యార్థులు ఉన్నారని వారిలో నూజివీడు జూనియర్ కళాశాలలో 410 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను దిర్చిదిద్దేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎపి మోడల్ స్కూళ్లు, కస్తూరిభా గాంధీ విద్యాలయాలు, హైస్కూల్స్ ప్లెస్ స్కూళ్లలో విద్యనభ్యసిస్తున్న 2 లక్షల మందికిపైగా ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. బోధనా విధానాన్ని మెరుగు పర్చేందుకు జిల్లా, రీజనల్ స్థాయిలో అకడమిక,గైడెన్స్ అండ్ మోనాటరింగ్ సెల్ ను ఏర్పాటు చేశారన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి ఎంసెట్, నీట్ పరీక్షల మెటీరియల్, ప్రాక్టికల్ రికార్డులు, పుస్తకాలు, ఇంటర్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు అందజేయ నున్నట్లు రాష్ట్ర మంత్రి పార్థసారధి తెలిపారు. అదే విధంగా మనబడి-మన భవిష్యత్ పదకం కింద రాష్ట్రంలో 447 కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్ప నకు రూ. 307.76 కోట్ల అంచనాలతో పనులను ప్రతిపాదించగా ఇందుకోసం ఇప్పటివరకు రూ. 169.69 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయి సంస్కరణలోత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానున్నదన్నారు.

విద్యాతోపాటు అనేక అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. రానున్న సంక్రాంతి నాటికి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రోడ్ల మరమ్మత్తు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. అదే విధంగా అధికారంలోకి రాగానే పోల వరం ప్రాజెక్టును సందర్శించి నిర్వాసితులకు న్యాయం చేస్తామని చెప్పి నేడు ఆ మాటను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారన్నారు. ఈ మేరకు సంక్రాంతి కానుకగా 10 వేల మంది పోలవరం నిర్వాసితులకు పరిహారంగా ఒకేరోజు రూ. 815 కోట్లు చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుం దన్నారు. కార్యక్రమంలో డివిఇవో బి. ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హైబ్రిడ్ మోడల్ పేరుతో ఆరోగ్యశ్రీలో మార్పు

- **ఏకంగా రూ.5800 కోట్ల అవినీతికి శ్రీకారం**
- **మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజం**

**పలాస, మహానాడు:** హైబ్రిడ్ మోడల్‌తో ఏం ప్రయోజనాలున్నాయి? దీనికి మంత్రి సూటిగా సమాధానం చెప్పగలరా? ఆ విధానంతో సొంత ఇన్సూరెన్స్ కంపెనీకి దోచి పెట్టే కుట్ర అని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. తిరిగి ఆ డబ్బంతా నారా లోకేశ్ జేబుల్లోకే.. హెల్త్ కవరేజీ కేవలం రూ.5 లక్షల వరకే కుదింపు

కొత్త మోడల్‌తో ఖరీదైన చికిత్సలకు వైద్యం అనుమానమే అని అన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే... కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ నిర్వీర్యం. దేశమంతా మెచ్చుకున్న గొప్ప పథకానికి తూట్లు. సూపర్ సిక్స్‌తో సహా, ఏదీ అమలు చేయని ప్రభుత్వం

పథకాల అమలు చేయకనే రూ.1.19 లక్షల కోట్ల అప్పా! పింఛన్లు, ఉద్యోగుల జీతాలకు ఏకంగా లక్ష కోట్లా?



చేసిన అప్పులకు, చేస్తున్న పనులకు పొంతన లేదు. దేశానికే తలమానికంగా ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా ట్రస్టు మోడల్ నుంచి హైబ్రిడ్ మోడల్‌లోకి మారుస్తామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చెబుతున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 5 లక్షల ఆదాయ పరిమితి ఉన్న 1.43 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల వరకు రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ సేవలను ఉచితంగా అందించాం. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం ప్రకారం రూ.2.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆపై మరో రూ.2.5 లక్షలు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలందిస్తామని చెబుతున్నారు. ఇదే జరిగితే కాంక్లియర్ ఇంప్లాటేషన్, బోన్ మ్యారో సర్జరీ వంటి ఖరీదైన చికిత్సలు పేదవారికి ఉచితంగా అందే పరిస్థితి ఉండదు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌లు తిరస్కరిస్తే పరిస్థితి ఏమిటి? అత్యవసర వైద్యానికి అప్రూవల్ రావడంలో ఆలస్యమైతే ఎవరు బాధ్యులు? ఆరోగ్యశ్రీలో 3257 ప్రోసీజర్లకు వైద్యం అందిస్తే, ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చే హైబ్రిడ్ మోడల్‌లో, అన్ని ప్రోసీజర్లకు వైద్యం అందుతుందన్న గ్యారెంటీ ఉండదు. ఉచితంగా మందులు ఇవ్వరు. రోగి హెల్త్ ప్రొఫైల్‌ని పరిగణలోకి తీసుకుంటే ఇన్సూరెన్స్ వర్తింపజేయరు. ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లో ఉన్న ఇబ్బందులను అధిగమించడమే లక్ష్యంగా దివంగత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ట్రస్ట్ మోడల్‌లో తీసుకొచ్చి వేగంగా వైద్య సేవలందించే విధానం తీసుకొచ్చారు. కానీ చంద్రబాబు మళ్లీ పాత విధానానికి తీసుకెళ్తున్నారు.



## అనధికార లే అవుట్లపై ఉక్కుపాదం!

- **మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరిక**

**చిలకలూరిపేట, మహానాడు:**

పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఎక్కడా అనధికార లే అవుట్లు ఉండటానికి వీల్లేదని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ధనార్జనే ధ్యేయంగా మంచినీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలు లేకుండా వేసిన లే అవుట్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపబోతోందని మాజీ మంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం పట్టణంలోని శారదా జడ్.పీ.పీ. హైస్కూల్ లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా గతప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలతో పాటు చెరువులు.. కుంటలు.. కాలువలు సహా చుక్కల, నిషేధిత భూములతో పాటు కొందరు భూములను ఆక్రమించారని, సదరు ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్టు పుల్లారావు చెప్పారు.


## వైసీపీ నేత నేదురుమల్లిపై కేసు!

**నెల్లూరు, మహానాడు:** వైసీపీ నేత నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిపై కేసు నమోదు అయింది. రాంకుమార్‌రెడ్డి సహా 12 మందిపై వెంకటగిరి పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల టీడీపీ నేత సీసీ నాయుడుపై వైసీపీ నేతలు దాడి చేశారని పోలీసులు తెలిపారు.

## 'గేమ్ ఛేంజర్' టికెట్ల ధర పెంపు

- **సర్కారు అనుమతి మంజూరు**

**అమరావతి, మహానాడు:** గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ రేట్లను పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. రాత్రి ఒంటిగంట బెనిఫిట్ షో టికెట్ ధర 600 రూపాయలుగా



నిర్ణయించింది. ఈ నెల పదోతేదీ 10 నుంచి 23 వరకు అయిదు షోషులకు టికెట్ రేట్లు పెంపునకు అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్ టికెట్ కు అదనంగా రూ. 175 కు, సింగిల్ స్క్రీన్స్ లో టికెట్ కు అదనంగా రూ.135 పెంపునకు ఉత్తర్వులు జారీ చేసింది.

## అరుదైన గౌరవం దక్కించుకున్న భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

**అమరావతి, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు దేశంలోనే అరుదైన గౌరవం దక్కింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భాగస్వామ్యంతో, ఛత్తీస్‌గఢ్ పట్టణ మురికివాడలలో నివసించే 45 లక్షల మందికి 41 రకాల ల్యాబ్ మరియు డయాగ్నస్టిక్ పరీక్షలతో కూడిన సేవలను 94 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా అందిస్తోంది. ఈ విశిష్టమైన సేవలకుగాను, దేశంలోనే మొట్టమొదటిసారిగా నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ లాబొరేటరీస్) ధృవీకరణ పొందినందుకు సంతోషకరంగా ఉంది.

BHSPL
Bavya Health Services Pvt.Ltd.

ఈ సంస్థ ఆరోగ్య సంరక్షణ సేవల నిర్వహణ, ఆసుపత్రుల నిర్వహణ, టెలీమెడిసిన్, ఫార్మసీ నిర్వహణ & సరఫరా, అంబులేటరీ కేర్ సేవలలో విశేష అనుభవాన్ని కలిగి ఉంది. పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో నగరాలు, గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమ వైద్య సేవలను అందిస్తోంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025
























**విశాఖలో ఇండియన్ నేవీ ఆపరేషనల్ డెమో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

















జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 05, జనవరి 2025



సత్య సాయి జిల్లా మడకశిర శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు ఎంఎస్ రాజు శ్రీవారి దర్శనార్థం తిరుమలకి శ్రీవారి మెట్ల నుండి కాలినడకన దైవ దర్శనార్థం వెళ్లడం జరిగింది. శాసనసభ్యులు వెంటా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి వెంకటప్ప. దరూర్ ఓబుల నాయుడు .నాగరాజు. ఆది నరసింహులు .శ్రీనివాసులు .గణేష్. శివ తదితరులు ఎమ్మెల్యే వెంట వెళ్లి దర్శనం చేసుకున్నారు.



నేడు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

# జగన్ గాలిలో కాకుండా రోడ్లపైకి వచ్చి మేంచేసిన మంచిని చూడాలి

- మాది ప్రజాప్రభుత్వం... ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- దేశ, విదేశాల్లో అధ్యయనం ద్వారా ఎపి మోడల్ ఎడ్యుకేషన్ రూట్ మ్యాప్
- విజయవాడ విలేకరుల సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్



**అమరావతి,మహానాడు:** పద్ధతిప్రకారం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీ లను నెరవేరస్తున్నాం. హామీ ఇవ్వని పథకాలను కూడా అమలు చేస్తున్నాం. ఎవరు అడగకుండానే ఇంటర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం. గౌరవ పులివెం దుల ఎమ్మెల్యేగారు గాలిలో కాకుండా రోడ్డుపైకి వచ్చి మేం చేస్తున్న మంచి పనులను చూడవచ్చని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విజయవాడ పాయకా పురం జూనియర్ కళాశాల ఆవరణలో మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ... జగన్ ప్రజల్లోకి వచ్చి సమస్యలు తెలుసుకోవడంలో తప్పులేదు. ఇప్పుడు రోడ్లు కూడా మంచివి వేశాం, ఆయన నిర్భయంగా రోడ్లపైకి రావచ్చు. ఇంకా మేం చేయాల్సి చాలా ఉంది, అన్నీ చేస్తాం. జగన్ వచ్చి మేం అమలుచేస్తున్న మంచి కార్య క్రమాలు చూడాలని కోరుతున్నాం. రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో మాదిరి మాది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కాదు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమ స్యలు పరిష్కరిస్తున్నాం. ప్రజాదర్బార్ ద్వారా సమ స్యలు తెలుసుకుంటున్నాం. గత ప్రభుత్వ తప్పుల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుంది. 4వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా 4వేల పెన్షన్ అందజేస్తున్నాం. గత ప్రభుత్వం మూసి వేసిన అన్నక్యాంటీన్లు తెరిచాం. ఉచిత గ్యాస్ పథకాన్ని ఇప్పటికే అమలుచేస్తున్నాం.

### ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుపరుస్తాం

రాష్ట్రంలోనివిశ్వవిద్యాలయాల్లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు కృషిచేస్తున్నాం. అంతర్జాతీ యంగా టాప్–100 వర్సిటీల్లో ఎపి విశ్వవిద్యాలయాలను నిలప డానికి ప్రయత్నిస్తున్నాం. ఉన్నత విద్యావంతుడ్ని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా నియమించాం, మిగతా విశ్వవిద్యా లయాలకు కూడా మంచి విసిలను ఎంపికచేసే పనిలో సెర్చి కమిటీలు ఉన్నాయి. రాష్ట్రాన్ని నాలెడ్జి సొసైటీగా, నాలెడ్జి ఎకానమీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాం. ప్రభుత్వరంగంతోపాటుప్రైవేటు రంగంలో పలు ప్రఖ్యాత విద్యాసంస్థలు రాష్ట్రానికి వస్తు న్నాయి. యువగళం పాదయాత్రలో ఇంటర్ విద్యార్థులు తనను కలిసినపుడు తమ తల్లిదండ్రులు ప్రైవేటు కాలేజిలకు పంపలేక ప్రభుత్వ కాలేజిల్లో చేరుతున్నామని చెప్పారు. ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు, కరిక్యులమ్ మెరుగు పర్చాలని కోరారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక జూనియర్ కాలేజిల్లో ఉచితంగా టెక్ట్స్ బుక్స్ ఇచ్చాం, ఈరోజు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాం.

### ఎపి మోడల్ ఎడ్యుకేషన్ కు రూట్ మ్యాప్

నాలెడ్జి సొసైటీలో హెచ్ఆర్ డి కీలక పాత్ర పోషిస్తుంది. అటువంటి శాఖను తాను చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నాను. కెజి నుంచి పిజి వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నాం. ఇతరరాష్ట్రాలు, దేశాల్లో మెరుగైన విద్యా విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. గతంలో మాదిరి ఏకపక్షంగా కాకుండా యూనియన్లతో చర్చిస్తున్నాం. వాస్తవంగా విద్యార్థులకు ఏంకావాలో తెలుసుకున్నాకే నిర్ణయాలు తీసుకుంటున్నాం. తాను పాఠశాలలు, లైబ్రరీల ఆకస్మిక తనిఖీలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నాను. ఎపి మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్ కు రూట్ మ్యాప్ తయారైంది. హయ్యర్ ఎడ్యుకేషన్ కరిక్యులమ్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దే బాధ్యత నాది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రైవేటుకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు.



## గుంటూరు మహానాడు కార్యాలయంలో కోఆర్డినేటర్ రవిచంద్ర బర్త్ డే వేడుకలు

**గుంటూరు, మహానాడు:** రవిచంద్ర కేక్ కటింగ్ కార్యక్రమంలో మహానాడు అధినేత బోడేపూడి వెంకట సుబ్బారావు మహానాడు ఎడిటర్ మారుతి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడేపూడి సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టుగా కొనసాగుతూ విలువలు నిబద్ధతతో సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న రవిచంద్రన్ ఆయన అభినందించారు. ఆయన మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని సుబ్రమణ్యం ఆకాంక్షించారు.

# ఏపీలో సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

- చిత్ర పరిశ్రమ కోసం కొత్త ఫిల్మ్ పాలసీని తీసుకొస్తాం
- రాబోయే రోజుల్లో తెలుగు సినిమా చరిత్రలో ఐ ఈ చిత్రం గేమ్ ఛేంజర్‌గా నిలబడాలని ఆకాంక్షించిన మంత్రి దుర్గేష్
- అనేక ప్రకృతి సౌందర్యాలతో అలరారుతున్న అద్భుత దృశ్య కావ్యం ఆంధ్ర ప్రదేశ్ అని తెలిపిన మంత్రి దుర్గేష్
- సీఎం, డిప్యూటీ సీఎం నేతృత్వంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి దుర్గేష్
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూడాలని నిర్మాతలను కోరిన మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం:** అనేక ప్రకృతి సౌందర్యాలతో అలరారుతున్న అద్భుత దృశ్య కావ్యం ఆంధ్రప్రదేశ్ అని, అందాల హరివిల్లుకు ప్రతిరూపమైన ఏపీలో సినిమా పరిశ్రమను ప్రోత్సహిస్తామని, సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం ఫిల్మ్ పాలసీని తీసుకొస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడిం చారు. శనివారం రాజమహేంద్రవరం లోని వేమగిరిలో జరిగిన గేమ్ చేజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ మేరకు తెలుగు చలనచిత్ర పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధి చిందిస్తుంది అనే అంశాలను వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కళలు, భాష పట్ల ప్రత్యేక అభిమానం ఉన్న నాయకులని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాబోయే రోజుల్లో కొత్త ఫిల్మ్ పాలసీ తేవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగు సినిమా చరిత్రలో ఈ చిత్రం గేమ్ ఛేంజర్‌గా నిలబడాలని ఆకాం క్షించారు. సినిమా సినిమాకి పరిణతి కనబరుస్తూ, అద్భుతమైన నటుడిగా, తండ్రికి తగ్గ తనయుడుగా తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేకమైన పేజీని తయారు చేసుకునే విధంగా రామ్ చరణ్ అద్భుతమైన నటన కౌశల్యాన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి కొనియాడారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గోదావరి తీరాన రాజమహేంద్రవరంలో ఒకే వేదిక పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా నిర్మాతలు దర్శకులను ఉద్దేశిస్తూ ఏపీలో చాలా చిత్రాలు తీస్తున్నారని మంత్రి అన్నారు.. రాష్ట్రంలో సినిమా పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముందుకు రావాలని సీఎం, డిప్యూటీ సీఎం తరపున మంత్రి దుర్గేష్ కోరారు.. ఇప్పటికే పర్యాటక రంగానికి కొత్త టూరిజం పాలసీ తెచ్చినట్టు, ఇండస్ట్రీకి ప్రత్యేక పాలసీ ఇచ్చినట్లుగా సినిమా రంగం లో కూడా కొత్త పాలసీని తీసుకొచ్చి ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోనే అత్యంత గొప్ప డైరెక్టర్ గా పేరు పొందిన శంకర్ దర్శకత్వంలో గేమ్ చేంజర్ చిత్రం రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు.. ఈ సందర్భంగా సినిమా నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడిన చిత్ర బృందానికి మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సినిమా నిర్మాత దిల్ రాజుకు ఆల్ ది బెస్ట్ చెప్పిన మంత్రి నిర్మాతలంతా ఏపీని ప్రత్యే కంగా చూడాలని కోరారు.



దర్శిలో జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం నేటి నుంచి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ప్రారంభించిన డా.గొట్టిపాటి లక్ష్మీ



గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రూ.47.28 లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు, ఆర్ సీసీ కల్వర్టుల నిర్మాణాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి..)

ఖర్చు చేయనుందన్నారు.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే 1,63,750 మంది విద్యార్థినీ, విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యా శాఖా మంత్రి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా మేధో శక్తి, శారీరక బలంతో పాటు మానసిక వికాసం కలిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కర్నూలు జిల్లాలో ఉన్న 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 8678 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు.

రాష్ట్రంలో 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గాను



398 జూనియర్ కళాశాలలు మధ్యాహ్న భోజనం అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలలతో అనుసంధానమై ఉన్నందున ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్కడే నాణ్యత కలిగిన భోజనాన్ని తయారు చేసి సరైన సమయానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపిస్తారన్నారు..మిగిలిన 77 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ కూడా ప్రతిరోజు ఒకటే రకమైన మెనూ కాకుండా, రోజు కొక విధంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు..సోమవారం నాడు కూరగాయల పలావ్, కోడిగుడ్డుకూర, వేరుశనగ బెల్లం చిక్కి, మంగళవారం నాడు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ, బుధవారం నాడు కూరగాయల అన్నం, ఆలూకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కి, గురువారం నాడు సాంబార్ బాత్/లెమన్ రైస్, టమోట పచ్చడి, ఉడికించన కోడిగుడ్డు, శు క్రవారం నాడు అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కి, శనివారం నాడు ఆకుకూర అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్ ఈ విధంగా ప్రోటీన్, ఫైబర్,కార్బోహైడ్రేట్ లతో సమతుల ఆహారం ఉండే విధంగా మెనూ ఉందని సీఎస్ వివరించారు.

రాష్ట్రం, దేశం గర్వించదగ్గ మంచి పౌరులుగా, మంచి మేధావులుగా, అన్ని రంగాల్లో కూడా విశేష ప్రతిభను చూపించి ఈ కళాశాలకు మంచి పేరు తీసుకొని రావాలని సీ ఎస్ విద్యార్థులను ఆశీర్వదించారు.

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కర్నూలు జిల్లాకు విచ్చేసి ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు అమలు చేస్తున్న "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" లో పాల్గొనడం చాలా గర్వకారణమన్నారు.

కార్యక్రమానికి రావాలని ఆహ్వానించగానే సీఎస్.గారు పిల్లలందరినీ కలవాలనే ఉద్దేశంతో కళాశాలకు రావడం జరిగిందన్నారు. జిల్లాలోనే అత్యధిక విద్యార్థిని, విద్యార్థులు ఈ కళాశాలలో ఉన్నారని కలెక్టర్ సీ ఎస్ కు తెలిపారు.. మధ్యాహ్న భోజన పథకం ఇప్పటి వరకు పాఠశాలలలో మాత్రమే ఉండేదన్నారు.. కానీ ఈ రోజు నుండి రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలలో ఈ పథకం అమలు అయ్యేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ తెలిపారు..జిల్లాలో ఈ పథకం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.



### విద్యార్థులతో సహపంక్తి భోజనం

మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు.

సీఎస్‌తో పాటు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి విద్యార్థిని , విద్యార్థులతో కలిసి స్వీట్ పొంగల్, అన్నం, పప్పుచారు తో కూడిన భోజనాన్ని స్వీకరించారు.

సీఎస్ భోజనం చేసిన అనంతరం అక్కడే ఉన్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎమ్ పిసి చదువుతున్న విద్యార్థిని అఖిలతో, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం సిఈసి చదువుతున్న నైసిల ఎదురుగా కూర్చుని వారితో సంభాషించారు.. భోజనం ఎలా ఉంది? రుచికరంగా ఉందా? ఎలా చదువుతున్నారు? భవిష్యత్తులో ఏమి అవ్వాలను కుంటున్నారు.. లక్ష్యాలు ఏంటి? ఉపాధ్యాయులు ఏ విధంగా పాఠాలను బోధిస్తున్నారు? కళాశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మీ తల్లిదండ్రులు చాలా కష్టపడి చదివిస్తున్నారని, తల్లితండ్రుల పేరు నిలబెట్టే విధంగా, బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కేవలం లక్ష్యాలు మాత్రమే పెట్టుకోకుండా వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని ఈ సందర్భంగా సీ ఎస్ విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, డిఎస్పీ మహబూబ్ బాషా, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, డివిఈఓ వై.పరమేశ్వర రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరళ దేవి, ఒకేషనల్ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ నాగస్వామి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 05, జనవరి 2025




నిడదవోలు మోడరన్ రూఫింగ్ మహిళా కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికిన టీటీడీ సభ్యుడు నర్సిరెడ్డి, తెలంగాణ తెలుగు మహిళ రాష్ట్ర నాయకురాలు భవనం షకీలారెడ్డి



## వ్యవసాయ భూములకే రైతుభరోసా

- 2వేలు పెంచుతూ...ఎకరాకు 12 వేలు ఇవ్వాలని నిర్ణయం
- భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు కూడా సాయం
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సాయం
- వ్యవసాయేతర భూములకు భరోసా లేదని స్పష్టీకరణ
- జనవరి 26 నుంచి పథకాల అమలుకు నిర్ణయం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సిఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణలో జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం' అమలు కానుంది. రైతు భరోసా కింది వ్యవసాయ భూములు ఎకరాకు ఏటా 12వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో వ్యవసాయేతర భూములను మినహా యించారు. రాళ్లు,రప్పలు, కొండలు, రోడ్లో పోయిన భేములు, క్రషర్లు నిర్వహిస్తునన భూములు, ప్రభుత్వం సేకరించిన భూములు ఉన్నాయి. కేబినేట్ సమావేశంలో తీసుకున్న ఈ కీలక నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. గత ప్రభుత్వ నిర్ణయాలు సమీక్షించుకుంటే పోతే కెసిఆర్ కుటుంబం వెయ్యేళ్లు జైలులో మగ్గాల్సి ఉంటుందని అన్నారు. అందువల్ల గతంలో జరిగిన తప్పిదాల జోలికి పోకుండా ఇప్పుడు స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతున్నామని కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి వర్గ నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి మీడియాకు వివరించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26నుంచి దీనిని అమలు చేస్తామని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. 'తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి నూతన సంవత్సరంలో మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తాం. ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అని నామకరణం చేశాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేస్తాం' అని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా పథకం వర్తింప జేస్తామని స్పష్టం చేశారు. ఇందులో అనుమానాలకు తావులేదన్నారు. ఇదే సందర్భంలో సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వమని కూడా స్పష్టం చేశారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీ నుండి ఈ పథకం అమలు చేస్తామని ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో తెలంగాణ కేబినెట్ భేటీ అయ్యింది. ఈ సమావేశంలో రైతు భరోసా విధివిధానాలకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రి మండలి సుధీర్ఘ చర్చించింది. దీనితో పాటు పలు కీలక నిర్ణయాలకు మంత్ర మండలి ఆమోదం తెలిపింది. కేబినెట్ నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

# కూటమి ప్రభుత్వం సినిమాలను రాజకీయం చేయదు

- చిత్ర పరిశ్రమకు రాజకీయ రంగు పులమడం మాకు ఇష్టం లేదు
- చిత్ర పరిశ్రమ మీద ఎన్డీఏ ప్రభుత్వానికి గౌరవం ఉంది
- గత ప్రభుత్వం మాదిరి టిక్కెట్ల ధరల కోసం హీరోలు రావాలని పిలవం
- టిక్కెట్ల ధర పెంపు వల్ల ప్రభుత్వానికీ ఆదాయం వస్తుంది
- ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఎప్పుడూ చిత్ర పరిశ్రమ అభివృద్ధికే దోహదపడ్డారు
- తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాంచరణ్ మూలాలను మరచిపోకుండా ఎదిగాడు
- గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

రాజమహేంద్రవరం: 'చిత్ర పరిశ్రమకు రాజకీయ రంగు పులమడం మాకు ఇష్టం లేదు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలుగు చిత్ర పరిశ్రమకు అండగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చిత్ర పరిశ్రమ మీద గౌరవం ఉంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చిత్ర పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది తప్ప ఎవ్వరినీ ఇబ్బందపెట్టబోద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. టిక్కెట్ల ధరలు పెంచేందుకు గత ప్రభుత్వం మాదిరి హీరోలని పిలవబోమని అన్నారు. టిక్కెట్ల ధరలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా టాక్స్ రూపంలో ఆదాయం వస్తుందని, కొంత మంది ధరల పెంపుని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. శనివారం సాయంత్రం రాజమండ్రిలో గ్లోబల్ స్టార్ రాంచరణ్ గారు నటించిన గేమ్ ఛేంజర్ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి శ్రీ శంకర్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "సినిమాలు తీయకుండా రాజకీయాలు చేసే వారు నాకు నచ్చరు. తెలుగు చిత్ర పరిశ్రమ గురించి మాట్లా డాలి అంటే సినిమాలు తీసి దాని సాదకబాధకాలు తెలిసిన వారే మాట్లాడాలి. ఎన్డీఏ ప్రభుత్వం తరఫున చెబుతున్నాను. టీడీపీ, జనసేన, బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వారితోనే మాట్లాడుతుంది. వారినే గుర్తిస్తుంది. సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు హీరోలతో పని ఏంటి? హీరోలు ఎందుకు రావాలి? అలా హీరోలని రప్పించుకోవడం మాకు ఇష్టం లేదు. నిర్మాతలు, ట్రేడ్ బాడీ యూనియన్ వచ్చినా టిక్కెట్ల ధరలు పెంపు ఇస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి హీరోలు వచ్చి మాకు నమస్కారాలు పెట్టాలని ఆలోచించేలో లెవల్ వ్యక్తులం కాదు. మేము స్వర్గీయ ఎన్టీఆర్ నుంచి చాలా నేర్చుకున్నాం. ఆయన్ని ఎంత మంది విమర్శించినా కలసి నటించేప్పుడు బాగున్నారా అని గుండె నిండుగా పలుకరించేవారు. శ్రీ ఎన్టీఆర్ గారి ప్రభుత్వం శ్రీ కృష్ణ గారు లాంటి వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా ఎప్పుడూ ఇతర హీరోల మీద వివక్ష చూపలేదు. చిత్ర పరిశ్రమ తాలూకు ఔన్నత్యం అది. దాన్ని మేము కొనసాగిస్తాం.

### చంద్రబాబు నాయుడు చిత్ర పరిశ్రమను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు

గత ప్రభుత్వంలో మాదిరి మీరంతా అభిమానించే శ్రీ మెగాస్టార్ చిరంజీవి గారు లాంటి వారిని గాని, బాహుబలి శ్రీ ప్రభాస్ లాంటి వారిని గాని, ప్రిన్స్ శ్రీ మహేష్ బాబు లాంటి వారినిగానీ మేము పిలవం. మాకు చిత్ర పరిశ్రమ మీద గౌరవం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఎప్పుడూ చిత్ర పరిశ్రమ అభివృద్ధికి దోహదపడ్డారు తప్ప తెలుగు చిత్ర పరిశ్రమను ఎప్పుడూ ఇబ్బందిపెట్టలేదు.

### సమాజాన్ని ఆలోచింపజేసే సినిమాలు రావాలి

మనం నిజ జీవితంలో చేయలేని వాటిని సినిమాల్లోని పాత్రల్లో ఊహించుకుని చూస్తాం. మనసులో భావన తెరకెక్కించడం వల్లే ఒక్కడు లాంటి సినిమాలు చూస్తాం. ఎదురు తిరిగితే ఎలా ఉంటుందో శివాజీ లాంటి సినిమాలు చూసి తృప్తిపడతాం. సినిమాలు ఒక మార్గదర్శకం. సినిమాల్లో చాలా విలువలు ఉంటాయి. సినిమాల్లో మంచీ చెడూ రెండూ ఉంటాయి. సినిమాల్లో ఉన్న విలువలు మాత్రమే మనం స్వీకరించాలి. వకీల్ సాబ్‌లో ఓ డైలాగ్ నేను చెప్పడానికి ఆలోచించాను. హీరోలు, దర్శకులు సమాజం మీద తీవ్ర ప్రభావం చూపుతారు. సమాజానికి వినోదాన్ని పంచే సినిమాలతోపాటు సమాజాన్ని ఆలోచింప చేసే సినిమాలు రావాలి. ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే, ప్రజలకు మంచి నేర్పే సినిమాలు రావాలని కోరకుంటున్నాను. పెరిగిన టిక్కెట్ల ధరలు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. పెరిగిన ప్రతి రూపాయి మీద 18 శాతం జీఎస్టీ వస్తుంది.



### గత ప్రభుత్వంలో నా సినిమాలకు టిక్కెట్ ధర తగ్గించేశారు

సినిమాలకు అడగగానే అసలు టిక్కెట్ ధరలు ఎందుకు పెంచాలి? డిమాండ్ సప్లై సూత్రాన్ని అనుసరించే సినిమా టిక్కెట్ల ధరలు పెంచుతారు. శ్రీ శంకర్ గారి సినిమా నేను బ్లాక్ లో టిక్కెట్లు కొనుక్కుని చూశా. బ్లాక్ లో టిక్కెట్లు కొని సినిమాలు చూస్తే ఆ డబ్బు ఎవరికో వెళ్లిపోతుంది. సినిమాలకు బడ్జెట్లు పెరిగిపోయాయి. పెట్టుబడులు పెరిగిపోయాయి. అయినా టిక్కెట్ ధరలో పెంచిన ప్రతి రూపాయికీ 18 శాతం ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో పన్ను వస్తుంది. దీని మీద తప్పుడు ప్రచారం ఉంది. గత ప్రభుత్వంలో నా సినిమాకి టిక్కెట్ ధరలు పెంచకపోగా తగ్గించేశారు. చాలా మంది హీరోలు కూటమికి కూటమి ప్రభుత్వానికి మద్దతు కూడా తెలపలేదు. అయినా మేము ఎవరిపట్ల వివక్ష చూపలేదు. కూటమి ప్రభుత్వం సినిమాలను రాజకీయం చేయదు.

### మన జాతి విశిష్టతను సినిమాలే చూపాలి

ఒక చిన్న పెన్సిల్ తయారీకి అనేక దేశాలకు చెందిన రకరకాల వ్యక్తులు కలిసి రావాలి. గేమ్ ఛేంజర్ సినిమాకి దర్శకులు శంకర్ తమిళ్, నిర్మాత శ్రీ దిల్ రాజు తెలంగాణ, ఒక్కొక్కరు ఒక్కో రాష్ట్రం నుంచి వస్తారు. అందరూ కలసి సినిమా తీసి ఆహ్లాదం కలగజేస్తారు. భారతీయ చిత్ర పరిశ్రమ హాలీవుడ్ నుంచి క్రమశిక్షణ నేర్చుకోవాలి. 90వ దశకం నుంచి టాలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్ అని వచ్చింది. హాలీవుడ్లో నుంచి వుడ్ తీసుకున్నాంగాని ఆ పరిశ్రమ క్రమశిక్షణ మాత్రం ఫాలో అవ్వం. స్కిల్ డెవలప్మెంట్ ఫాలో అవ్వం. మనకు గొప్ప గొప్ప కావ్యాలు రాసిన కవుల, కళాకారులు ఉన్నారు. మన జాతి తాలూకు విశిష్టతను సినిమాలే చూపాలి. హాలీవుడ్‌ను అనుకరించడం మానేయాలి. మనదైన సత్తా, మనవైన కథలు రావాలి.

### యువతకు చిత్రపరిశ్రమ ద్వారా ఉపాధి కల్పించండి

రాష్ట్రంలో యువత బైకుల్లో తిరిగి గోల చేస్తారు అని అంటారు. ఉద్యోగాలు, ఉపాధి అవ్వడానికి సమయం పడుతున్నప్పుడు గోల చెయ్యక ఏం చేస్తారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఆంధ్ర, తెలంగాణల్లో అద్భుతంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను శ్రీ దిల్ రాజు గారు లాంటి నిర్మాతలు ఆంధ్రప్రదేశ్ లో యువతకు స్కిల్ డెవలప్ చేయాలి. స్టంట్ స్కూల్స్ పెట్టాలి. శ్రీ రాజమౌళి, శ్రీ త్రివిక్రమ్ లాంటి వారు స్క్రీన్ ప్లే క్లాసులు ఇవ్వాలి. శ్రీ కీరవాణి గారు, శ్రీ తమన్ గారు లాంటి వారికి సినిమాకు అనువైన సంగీత పాఠాలు నేర్పమని చెప్పాలి. రాష్ట్రంలో స్టూడియోలు పెట్టండి. చిత్ర పరిశ్రమ ద్వారా యువతకు ఉపాధి కల్పించండి. మేమంతా అండగా ఉంటాం. రాష్ట్రంలో చిత్ర నిర్మాణానికి అనుకూలంగా ఉన్న లొకేషన్స్ గుర్తించండి. ప్రభుత్వం మీకు సౌకర్యాలు కల్పిస్తుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుంది. గేమ్ ఛేంజర్ ఒక సోషల్ మెసేజ్ ఉన్న సినిమా. శ్రీ శంకర్ గారు అద్భుతంగా తెరకెక్కించారు. కొత్త సంవత్సరంలో గేమ్ ఛేంజర్ ద్వారా బాక్సాఫీస్ బద్దలు కావాలి.

### అందరి సినిమాలూ బాగుండాలని కోరుకుంటాము

శ్రీ రామ్ చరణ్ గారు ఆస్కార్ కి వెళ్లినా తనను తాను నియంత్రించుకోగలిగిన వ్యక్తి. పదహారణాల తెలుగువాడు. ఒక తల్లికి పుట్టకపోయినా సోదర సమానుడు. ఒక బాబాయ్ గానే కాకుండా అన్నగా చిత్రం ఘన విజయం సాధించాలని కోరుతూ ఆశీర్వదిస్తున్నాను. చిత్ర యూనిట్ మొత్తానికి పేరు పేరునా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మా ఇంట్లో ప్రతి హీరో చిత్రం బాగుండాలని కోరుకుంటాం. సర్వేజనా సుఖినోభవంతు అనే భావాన్ని మా నాన్న మాకు అలవాటు చేశారు. అన్నయ్య చిరంజీవి షూటింగ్ చేసి అలసిపోయి ఇంటికి వచ్చి షూ కూడా తీయకుండా అలాగే పడు కుండిపోయేవారు. తండ్రి కష్టాన్ని చూసి... మూల లను మరచిపోకుండా ఉన్న నటుడు రాంచరణ్. తండ్రి మెగాస్టార్, వారసుడు గ్లోబల్ స్టార్. ఈ ఫంక్షన్‌కి వచ్చిన మీరంతా క్షేమంగా ఇంటికి వెళ్లాలి. ఆనందం విషాదం కాకూడదు. అభిమానులకు చిన్న దెబ్బ తగిలినా నా గుండెకు గాయం అవుతుంది. అంతా క్షేమంగా ఉండాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ శ్రీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శ్రీ ఆదిరెడ్డి వాసు, శ్రీ బత్తుల బలరామకృష్ణ, శ్రీ కొలికపూడి శ్రీనివాస్ రావు, కౌడా ఛైర్మన్ శ్రీ తుమ్మల బాబు, చిత్ర బృందం పాల్గొన్నారు.

# త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు 90 వేల కళ్లద్దాల పంపిణీ

- నియోజకవర్గాల స్థాయిలో పంపిణీకి ఏర్పాట్లు చేయండి
- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాలకు చర్యలు
- 45 ఏళ్లు పైబడిన గ్రామీణులందరికీ ఉచిత కంటి పరీక్షల్ని చేసేందుకు కార్యాచరణ
- ఎన్ హెచ్ ఎం నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్ హెచ్ ఎం కార్యక్రమాలన్నీ క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గిరిజన ప్రాంతాల్లో మందుల పంపిణీ, టెస్టులకు డ్రోన్లను వాడాలి
- జనాభా పెరుగుదలకు అవగాహన కల్పించాలి
- ఎన్ హెచ్ ఎం కార్యక్రమాల సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



మంగళగిరి: త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 5 నుండి 15 ఏళ్ల మధ్య వయసు గల పాఠశాల విద్యార్థులకు 90 వేల కళ్లద్దాలను పంపిణీచేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. నియోజకవర్గాల స్థాయిలో పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాల్ని నిర్వహించాలని మంత్రి సూచించారు. అలాగే, 45 ఏళ్లు పైబడిన గ్రామీణులందరికీ ఉచిత కంటి పరీక్షల్ని చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. నేత్రదానాన్ని ప్రోత్సహించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, జిల్లాల్లోని అన్ని చోట్లా కార్నియాల సేకరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద అమలవుతున్న పలు కార్యక్రమాలపై శనివారం నాడు మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ మరియు నేషనల్ హెల్త్ మిషన్ ఎం.డి వాకాటి కరుణ కార్యక్రమాలు అమలవుతున్న తీరును పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. జనాభా పెరుగుదలకు వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అసాధారణ వ్యాధులు( రేర్ డిసీజెస్) విషయంలో కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. ఇందుకు సంబంధించిన నిపుణుల్ని సంప్రదించాలన్నారు. మాతృ, శిశు మరణాల్ని తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేరళ రాష్ట్రంతో పోల్చుకుంటే మనం చాలా వెనుకబడి ఉన్నామని, ఇతర రాష్ట్రాల్లో కూడా పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మానసిక సమస్యలకు సంబంధించి టెలీమానస్‌కు ఎటువంటి కాల్స్ వస్తున్నాయని ఈ సందర్భంగా మంత్రి ఆరా తీశారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వాసు పత్రుల్లో క్రిటికల్ కేర్ పరికరాల్ని సకాలంలో రిపేర్ చేయడంలేదన్న ఫిర్యాదులొస్తున్నాయని, దాన్ని సరిచేసేందుకు పూర్తి పర్యవేక్షణ ఉండాలన్నారు. ఫిర్యాదులొచ్చిన 24 గంటల్లో రిపేర్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎపిపిఎస్సీ ద్వారా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ల నియామకాలు లేటవుతున్నందున, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా నియామకాలు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎపిపిఎస్‌సి అధికారుల్ని వెంటనే సంప్రదించాలని ఆదేశించారు. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, ఎన్ ఎహెచ్ ఎం సిఎఓ గణపతిరావు, ఎడీలు, డీడీలు, ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

09

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 05, జనవరి 2025

## మహేష్‌తో రావిపూడి మరో మూవీ

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు దర్శకధీరుడు రాజమౌళితో చేస్తున్న సినిమా కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఇటీవల పూజా కార్యక్రమాలు జరగ్గా.. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. అందుకు గాను జక్కన్న ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో ఉన్నారు. అయితే సూపర్‌స్టార్ మహేష్‌బాబు 29కి విజయేంద్రప్రసాద్ కథ అందించగా.. ఎం ఎం కీరవాణి బాణీలు కడుతున్నారు. హీరోయిన్‌గా గ్లోబల్ స్టార్ ప్రియాంక



చోప్రాను.. విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ ను ఫిక్స్ చేసినట్లు కొద్దిరోజులుగా టాక్ వినిపిస్తోంది. ఇండియాతో పాటు కెన్యాలో షూటింగ్ జరపనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహస ప్రయాణంగా, అటవీ నేపథ్యంలో సాగే కథతో సినిమా తెరకెక్కిస్తున్నట్లు.. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. రీసెంట్‌గా గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో హీరో రామ్ చరణ్ చెప్పినట్లు.. 2026లో సూపర్‌స్టార్ మహేష్‌బాబు 29 ఫస్ట్ పార్ట్ రిలీజ్ అయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రాజమౌళితో మహేష్ మూవీ స్టార్ట్ అయ్యే లోపు.. ఆయన అనిల్ రావిపూడితో ఓ సినిమా చేస్తే బాగుండేదని ఆ మధ్య అనేక మంది ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. జక్కన్న ప్రాజెక్ట్ కంప్లీట్ అవ్వడానికి టైమ్ పడుతుంది.. దానికి తోడు రావిపూడి స్పీడ్‌గా సినిమా పూర్తి చేస్తారు.. అందుకే అలా జరిగి ఉంటే బాగుండేదని అనుకున్నారు. ఇప్పుడు ఆ విషయంపై అనిల్ రావిపూడి స్పందించారు. మహేష్‌తో రాజమౌళి మూవీ ఉండడమే కరెక్ట్ అని, మధ్యలో తనతో పని చేయడం కరెక్ట్ కాదన్నట్లు తెలిపారు. మహేష్ చాలా క్లారిటీగా ఉన్నారని తెలిపారు. ఆయనతో ఈ మధ్య రెండు మూడు యాడ్స్ చేశానని.. కొంతకాలం జర్నీ చేశానని చెప్పారు. "మహేష్ ఒకటి ఫిక్స్ అయ్యారంటే అది నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. మైండ్ బ్లాక్ సాంగ్ అందుకు ఎగ్జాంపుల్.. అప్పటి వరకు మహేష్ అంతలా డ్యాన్స్ చేయలేదు. ఆ సినిమాకు సాంగ్ కంపోజ్ అయిన వెంటనే.. బ్రదర్ ఈ సాంగ్ నా కోసమే అని చెప్పారు.. చేస్తా అని ఫిక్స్ అయ్యారు.. చేసేశారు. గుంటూరు కారం అయితే వేరే లెవెల్" అని తెలిపారు.

## ఇవేం స్టెప్పులు నాయనా?

నందమూరి బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా విడుదల చేసిన "దబిడి దిబిడి" సాంగ్ యూట్యూబ్ లో 11 మిలియన్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. అదే సమయంలో ఈ పాటలో స్టెప్పులపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. 'దబిడి దిబిడి' పాటను బాలయ్య, ఊర్వశీ రౌతేలాల మీద చిత్రీకరించారు దర్శకుడు బాబీ. ఇదొక మాస్ డ్యాన్స్ నంబర్. దీనికి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. ఇంతకముందు ఎప్పుడూ బాలకృష్ణ చేయని మాస్ స్టెప్పులను కంపోజ్ చేసే ప్రయత్నం చేశాడు. అయితే ఈ డ్యాన్స్ మీద నెటిజన్ల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఆయన గతంలో కొరియోగ్రఫీ చేసిన 'మా మా మహేష్', 'భూమ్ బద్దల్' పాటల్లోని డ్యాన్స్ మూవ్స్ ను రిపీట్ చేశాడని ట్రోల్ చేస్తున్నారు. శేఖర్ మాస్టర్ సెల్యులాయిడ్ అంటూ అన్ని పాటలను మిక్స్ చేసి పోస్టులు పెడుతున్నారు. ముఖ్యంగా 'దబిడి దిబిడి' పాటలో ఊర్వశి బ్యాక్ మీద బాలయ్యచేతులతో దరువు వేయడం, నాభి కింద చేయి పెట్టి డ్రెస్ లాగడం వంటి స్టెప్పుల మీద తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. బాలకృష్ణ లాంటి సీనియర్ హీరో, ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యే నటించిన పాటకు అలాంటి కొరియోగ్రఫీ చేయడం ఏంటని శేఖర్



ను విమర్శిస్తున్నారు. మాస్ స్టెప్పుల పేరుతో వల్గారిటీ కనిపించేలా డ్యాన్స్ కంపోజ్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజానికి 'మిస్టర్ బచ్చన్' సినిమాలో సితార్ పాటకు, 'పుష్ప 2'లో పీలింగ్స్ సాంగ్‌కు కూడా శేఖర్ ఇలాంటి స్టెప్పులనే కొరియోగ్రఫీ చేసాడు. హీరోయిన్ బొడ్డు కింద చెయ్యి పెట్టి చీర లేదా డ్రెస్సును లాగే స్టెప్పును హీరోలతో వేయించాడు. ఇప్పుడు 'దబిడి దిబిడి' పాటలోనూ సేమ్ డ్యాన్స్ మూమెంట్స్ పెట్టాడు. సితార్ సాంగ్‌లో మాదిరిగా హీరోయిన్ నడుము మీద తబలా వాయించే స్టెప్పును కూడా రిపీట్ చేసాడు. ఇవే ఇప్పుడు ట్రోల్ చెయ్యడానికి నెటిజన్లకు అవకాశం కల్పించాయి. శేఖర్ ప్రస్తుతం టాలీవుడ్ టాప్ కొరియోగ్రాఫర్స్‌లో ఒకరుగా రాణిస్తున్నారు. మహేశ్ బాబు లాంటి సూపర్ స్టార్‌తో 'గుంటూరు కారం' సినిమాలో మాస్ స్టెప్పులు వేయించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అయితే మిస్టర్ బచ్చన్, డాకు మహారాజ్ చిత్రాల్లో డ్యాన్స్ మూవ్స్ విషయంలో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇవి మరీ టూ మచ్ ఉన్నాయని, వల్గర్ ఫీలింగ్ కలిగించేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## 'సంక్రాంతికి వస్తున్నాం' నా జీవితంలో జరిగిన అద్భుతం- భీమ్స్ సిసిరోలియో



విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్ గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసి రోలియో విలేకరుల సమావేశంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విశేషాల్ని పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్ట్ ఎలా స్టార్ట్ అయ్యింది ? మీరు ప్రాజెక్ట్ లోకి ఎలా ఎంట్రీ ఇచ్చారు ? ఈ జర్నీ గురించి చెప్పండి?**

ముందుగా తెలుగు ప్రేక్షకులుకు ధన్యవాదాలు. అనిల్ రావిపూడి 'పటాస్' సినిమాకి పని చేసే అవకాశం వచ్చింది. కానీ అప్పుడు కుదరలేదు. ఫైనల్ గా13 ఏళ్ల తర్వాత మళ్ళీ అనిల్ గారితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. ఈ అవకాశం ఇచ్చిన అనిల్ కి ధన్యవాదాలు. దిల్ రాజు ప్రొడక్షన్ లో బలగం సినిమా చేశాను. సంగీత దర్శకుడిగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది. ఇప్పుడు మళ్ళీ దిల్ రాజు ప్రొడక్షన్ లో వెంకటేష్ అనిల్ తో కలిసి పని చేసే అవకాశం వచ్చింది. ఇదంతా పాటకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. పాట ద్వారా మీ అందరికీ చేరువైనందుకు ఆనందంగా వుంది.

ధమాక, మ్యాడ్, బలగం, రజాకార్, టిల్లు స్క్వేర్ .. ఇలా వరుస హిట్స్ తర్వాత నాకు వచ్చిన గొప్ప అవకాశం సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ గారితో కలసి పని చేయడం సందడిగా సంతోషంగా వుంటుంది. ఆయన దగ్గర నుంచి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఈ సినిమా పాటలు ప్రతి ఇంట్లో, ప్రతి పల్లెలో వినిపిస్తున్నాయంటే.. అనిల్‌కి సాహిత్యం, సంగీతంపై వున్న అభిరుచి దీనికి కారణం.

వెంకటేష్ సినిమాకి పని చేయడం దేవుని దయగా భావిస్తున్నాను. ఈ సినిమాలో బ్లాక్ బస్టర్ పొంగల్ సాంగ్ స్వయంగా వెంకటేష్ ఆయనంతట ఆయనే వచ్చి పాడటం కూడా దేవుని దయగా భావిస్తున్నాను. అదో కలలా అనిపించింది. సంగీత దర్శకుడిగా ఇది నాకో ఎచీవ్మెంట్. వెంకటేష్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నా జీవితంలో ఓ అద్భుతం జరిగింది. ఆ అద్భుతం పేరు సంక్రాంతికి వస్తున్నాం.

ఈ సినిమాలో గోదారి గట్టు సాంగ్ రమణ గోగుల పాడటం, ఆ పాట ఇప్పుడు ట్రెండింగ్ లో ఉంటూ 70 మిలియన్ వ్యూస్ క్రాస్ చేయడం ఆనందంగా వుంది. రమణ గోగుల నా పాట పాడతానని ఒప్పుకోవడం చాలా లక్కీగా భావించాను. మధుప్రియ కూడా అద్భుతంగా పాడారు. ఈ పాట ప్రతి ఇంట్లో వినిపించడం ఆనందంగా వుంది. అలాగే నేను పాడిన మీను సాంగ్ 17 మిలియన్ వ్యూస్ తో ట్రెండింగ్ లో వుంది. అలాగే వెంకటేష్ గారు పాడిన బ్లాక్ బస్టర్ సాంగ్ వైరల్ హిట్ కావడం చాలా ఆనందంగా వుంది.

ఈ సినిమా రీరికార్డింగ్ చేశాను. బ్లాక్ బస్టర్ పొంగల్ సాంగ్ ఎలా అయితే వుందో ఒక బ్లాక్ బస్టర్ సినిమాని తెలుగు ప్రేక్షకులు చూడబోతున్నారనే నమ్మకం వుంది. పాటలని ప్రేక్షకులు ఇంత గొప్పగా స్వీకరించిన విధానం బట్టి ఈ సినిమా ఉన్నతి ప్రగతి కనిపిస్తోంది. ఈ సినిమా చేయడం గర్వంగా వుంది.

## విజయ్ సేతుపతి రిలీజ్ చేసిన 'కోర' టీజర్



యాక్షన్ జానర్, పీరియాడిక్ డ్రామాతో వస్తున్న చిత్రాలకు ఇప్పుడు పాన్ ఇండియా వైడ్‌గా ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఇలాంటి తరుణంలోనే కన్నడ నుంచి మరో యాక్షన్ మూవీ రాబోతోంది. ఒరాటశ్రీ దర్శకత్వంలో సునామీ కిట్టి హీరోగా 'కోర' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో చరిష్మా, పి.మూర్తి ప్రధాన పాత్రలను పోషించారు. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్, రత్నమ్మ మూవీస్ బ్యానర్ల మీద డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ, పి.మూర్తి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇది వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్ కోర మీద అంచనాలు పెంచేశాయి. తాజాగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఈ మూవీ టీజర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేస్తూ టీంకు అభినందనలు తెలిపారు. ఇక కోర టీజర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. హై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లతో సరైన పాన్ ఇండియన్ మూవీలా కోర తెరకెక్కింది. టీజర్‌లో చూపించిన విజువల్స్, కెమెరా వర్క్, ఆర్ఆర్, యాక్షన్ సీక్వెన్స్ మాస్ ఆడియెన్స్‌కు ఐ ఫీస్ట్‌లా ఉంటుంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సెల్వం మాతప్పన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తుండగా.. బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



## శంకర్‌తో పని చేయడాన్ని ఎంతో ఎంజాయ్ చేశాను : రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ట్రైలర్‌కు విశేషమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ముంబైలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. రామ్ చరణ్ మాట్లాడుతూ.. 'శంకర్ తో సినిమా చేయడం నా అదృష్టం. ఆర్ఆర్ఆర్ టైంలో ఉన్నప్పుడే దిల్ రాజు నాకు శంకర్ సినిమా గురించి చెప్పారు. శంకర్ కథ చెబుతారు వినండి అని దిల్ రాజు అన్నారు. నేను వెంటనే షాక్ అయ్యాను. శంకర్ చెప్పిన కథ అద్భుతంగా అనిపించింది. ఆయన ప్రతీ విషయంలో ఎంతో పర్టిక్యులర్‌గా ఉంటారు. ప్రతీ దాన్ని ఎంతో పర్ఫెక్ట్‌గా చేయాలని చూస్తుంటారు. రాజమౌళి, శంకర్ ఇద్దరూ కూడా టాస్క్ మాస్టర్లే. సెట్‌లోకి నేను వచ్చినప్పుడు నన్ను కాకుండా నా హెయిర్‌ను చూశారు. ఆయన అనుకున్న దాని కంటే ఓ ఐదు శాతం తగ్గింది. అంత తీక్షణంగా ఆయన ప్రతీ ఒక్క విషయాన్ని పరిశీలిస్తుంటారు. ఆయనతో పని చేయడాన్ని నేను ఎంతగానో ఎంజాయ్ చేశాను. ఈ చిత్రంలో ఎస్ జే సూర్య అద్భుతంగా నటించారు. కియారాతో నేను చేసిన డ్యాన్సులు, పాటలు అందరినీ అలరిస్తాయి. మేం డల్లాస్‌లో చేసిన ఈవెంట్‌కు అంత రెస్పాన్స్ వస్తుందని అనుకోలేదు. డల్లాస్‌లో మాకు అపరమితమైన ప్రేమ లభించింది. గేమ్ చేంజర్ సినిమా జనవరి 10న రాబోతోంది. అందరికీ నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు.

## రాజమౌళి అయితే ఎవరికి గొప్ప?



మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవలే ప్రైవేట్‌గా పూర్తి చేశారు. ఎటువంటి మీడియా సమాచారం లేకుండా.. ఏహడావిడి లేకుండా మొదలుపెట్టారు. మీడియాకు ఆ వీడియోస్ ఎక్కడా కూడా రాకుండా జక్కన్న చాలా జాగ్రత్త పడ్డారనే చెప్పాలి. దాదాపు షూటింగ్ అంతా కూడా ఇలానే చాలా సీక్రెట్‌గా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫారెస్ట్ అడ్వెంచర్ గ్లోబల్ ట్రొట్టింగ్ సినిమాగా వస్తున్న ఈ సినిమాలో కథానాయిక ఎంపిక ఇంకా ఫైనల్ అవ్వలేదు. కానీ మీడియా మాత్రం ప్రియాంక చోప్రా ఫిక్స్ అని ఒకటే హడావిడి చేస్తున్నారు. రాజమౌళి సినిమా గురించి ఏదైనా వార్త వేసినా చాలు అది వెంటనే వైరల్ అవుతుంది. అందుకే జక్కన్న సినిమా అంటే చాలు మీడియా అంతా అలర్ట్‌గా ఉంటుంది. మహేష్ 29 సినిమాలో ముందు హాలీవుడ్ హీరోయిన్ నే తీసుకోవాలని అనుకున్నారు కానీ మధ్యలో ఏమైందో ఏమో కానీ ప్రియాంకా చోప్రా డిస్కషన్స్ లోకి వచ్చింది. రాజమౌళి ఆలోచన ఏంటన్నది తెలియదు కానీ ఎస్.ఎస్.ఎం.బి 29 సినిమా హీరోయిన్ గా ప్రియాంక చోప్రాని కన్ఫర్మ్ చేస్తున్నారు. బాలీవుడ్ నుంచి హాలీవుడ్ ప్రమోట్ అయ్యాక మళ్లీ తిరిగి ఇండియన్ సినిమాల వైపు చూడలేదు ప్రియాంకా చోప్రా. కానీ ఆమెను తీసుకు రావాలనే ప్రయత్నాలైతే ఎప్పటి నుంచో జరుగుతున్నాయి. రాజమౌళి అండ్ టీం ఈ విషయాన్ని ఎప్పుడు కన్ఫర్మ్ చేస్తారన్నది చూడాలి. ఐతే ఒకవేళ రాజమౌళి ఆమెకు ఆఫర్ ఇస్తే మాత్రం కాదనే ఛాన్స్ లేదు. ఎలాగు మన దగ్గర పీసీ క్రేజ్ ఏంటో తెలిసిందే. అదే కాకుండా రాజమౌళి ఆర్.ఆర్.ఆర్ ఇంటర్నేషనల్ లెవెల్ లో ఇంపాక్ట్ చూపించింది. అందుకే మహేష్ సినిమాకు ఆఫర్ వస్తే మాత్రం కాదనే ఛాన్స్ అయితే లేదు. ఐతే ప్రియాంక చోప్రా దాకా రాజమౌళి వెళ్లాడో లేదో తెలియదు కానీ మహేష్ సినిమాలో ఆమె ఫిక్స్ అన్నట్టుగా మీడియా ఒకటే హంగామా చేస్తుంది. పీసీ సినిమాలో ఉంటే అటు గ్లామర్ పరంగా ఇటు యాక్టింగ్ పరంగా అదిరిపోతుంది.ం

ఆమె ఏం చేసినా సంథింగ్ స్పెషల్ అన్నట్టే ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. ఇక ఈ విషయం పక్కనపెడితే... ఎంత రాజమౌళి పాన్ ఇండియా డైరెక్టర్ ఆఫర్ ఇస్తే మాత్రం తిరిగి తెలుగు సినిమా చేయడానికి ఆమె ఒప్పుకుంటుందా అన్న వాదనలు కూడా మరో పక్క వినబడుతున్నాయి. రాజమౌళి అయితే ఇక్కడ ఎవరి క్రేజ్ వాళ్ళకే ఉంది. ప్రియాంకకి మాత్రం క్రేజ్ ఏమీ తక్కువ కాదు కదా... సడెన్‌గా హాలీవుడ్ మూవీస్‌లో నటించి అమాంతం క్రేజ్ సంపాదించేసింది పీసీ.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144